
సాక్షి
అనంతపురం
సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో సోమవారం జిల్లా స్థాయి 'స్పందన' నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



టమాట కిలో రూ.6.50

స్థానిక కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట రూ.6.50 ప్రకారం పలికినట్లు ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
42.0°/22.9°

అనంతపురం జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదయ్యాయి. ఉక్కపోత తీవ్రంగా ఉంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

వలచి.. విలపించుటేల..!

- ఏప్రిల్ 14న అనంతపురంలోని ఓ కాలేజీలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న విక్రమ్‌కు వీడియోకాల్ వచ్చింది. ఆన్ చేయగానే యువతి నగ్నంగా కనిపించింది. ఇంకేముంది విక్రమ్ ఆసక్తిగా మాట్లాడాడు. కాల్ పూర్తయ్యాక వీడియో రికార్డింగ్ మొత్తం మొబైల్‌కు వచ్చింది. తర్వాత ఆ యువతి డబ్బు డిమాండ్ చేసింది.
- అనంతపురం సాయినగర్‌లో కేఫ్ యజమానికీ ఇలాగే కాల్ రావడంతో మాట్లాడాడు. అమ్మాయి మాటలు నమ్మి ఇంటి చిరునామా, పర్సనల్ మొబైల్ నంబర్ అన్నీ ఇచ్చాడు. మాట్లాడిన వీడియోలు పంపుతూ టార్చర్ పెడుతోందని వాపోయాడు. మీ ఇంటికొచ్చి మీ భార్యకు అన్నీ చెబుతానంటూ కూడా భయపెడుతోందని తెలిపాడు.

- వీడియోకాల్ లిఫ్ట్ చేస్తే అంతే సంగతులు
- న్యూడ్ వీడియోను రికార్డ్ చేసి బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్న వైనం
- డబ్బులివ్వకపోతే ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరింపులు
- 'వలపు వల'లో చిక్కుకుని విలవిల్లాడుతున్న యువకులు

అపరిచిత నంబర్ నుంచి వీడియో కాల్. లిఫ్ట్ చేస్తే అందమైన అమ్మాయి. అదీ అందాల ఆరబోతతో నగ్నంగా. ఆశ పడి మాటలు కలిపితే.. అబ్బాయినీ ముగ్గులోకి దించేస్తుంది. చిలిపి మాటలతో మొదలై వ్యక్తిగత విషయాలు సునాయాసంగా రాబడుతుంది. అంతలోనే కాల్ కట్.. క్షణాల వ్యవధిలో వీడియో కాల్ రికార్డ్ వాట్సాప్‌కు వచ్చేస్తుంది. డబ్బు కావాలంటూ డిమాండ్ చేస్తుంది. ఇవ్వకపోతే ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరిస్తుంది. ఇదీ ప్రస్తుతం కొందరు అమ్మాయిలు యువకులకు 'వలపు' వల విసిరి ఈజీగా డబ్బు సంపాదించడానికి ఎంచుకుంటున్న మార్గం.



సాక్షి ప్రతినిధి, అనంతపురం:

ఏదో రకంగా డబ్బు సంపాదించాలి.. కష్టపడకుండానే డబ్బు వచ్చి ఒళ్లో వాలిపోవాలి. చుక్క చెమట పట్టకుండా లక్షాధికారులు కావాలి.. పెడదారిలో వెళుతున్న యువత ఆలోచనలు ఇవీ. సామాజిక మాధ్యమాలు వచ్చిన తర్వాత బ్లాక్‌మెయిలింగ్ మరింతగా పెరిగింది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా మాయ చేసి మోసగిస్తున్నారు. ఇటీవల అనంతపురంలో జరిగిన కొన్ని ఘటనలతో కుర్రాళ్లు బెంబేలెత్తుతున్నారు.

ఆశ పడితే.. అధోగతే!

కొంతమంది అమ్మాయిలు వీడియోకాల్ చేస్తారు. ఫోన్ లిఫ్ట్ చేయగానే నగ్నంగా కనిపిస్తారు. వెంటనే ఫోన్ కట్ చేస్తే ఫరవాలేదు. కొంతమంది కుర్రాళ్లు ఇలాంటి దృశ్యాలు చూసి 'ఆశ'గా మాటలు కలుపుతారు. కుర్రాళ్లను కూడా బట్టలు లేకుండా వీడియోకాల్‌లోకి రావాలని కోరుతారు. ఈ వీడియోను రికార్డింగ్ చేస్తారు. ఇలా మాట్లాడుతుండగానే ఫోన్ కట్ అవుతుంది. ఆ తర్వాత వాట్సాప్ కాల్ చేస్తారు.

బ్లాక్‌మెయిల్ ఇలా చేస్తున్నారు..

ఎవరైతే వీడియోకాల్‌లో మాట్లాడారో ఆ వీడియోను మొబైల్‌కు పంపిస్తారు. అనంతరం డబ్బులు పంపించాలని డిమాండ్ చేస్తారు. లేదంటే ఈ వీడియోను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరిస్తారు. ఈ వీడియోలో ఇరువురి ఫొటోలు ఉంటాయి. కాబట్టి ఒక్కసారిగా అబ్బాయిలు కలవరపాటుకు గురవుతారు. ఎంతోకొంత ఫోన్ పే చేసి వదిలించుకుంటారు. డబ్బులు ఇవ్వకపోతే వీడియోను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలతో యువకులు బలవన్మరణాలకు పాల్పడుతున్న సందర్భాలూ లేకపోలేదు. ఇది ఒకరకంగా హనీట్రాప్ లాంటిదని పోలీసులు చెబుతున్నారు.



సైబర్ మోసాలపై అప్రమత్తం



సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. మనకు తెలియని వ్యక్తులు వీడియోకాల్ చేసినా, లింక్‌లు పంపినా వాటిని క్లిక్ చేయొద్దు. చాలామంది మొబైల్స్‌లో ఇలాంటి లింకులతో కొత్త యాప్ చేరి మన ఆధారాలన్నీ దొంగల చేతికి వెళుతున్నాయి. ఖాతాల్లో సొమ్ము పోవడానికీ ఇదే కారణం. మొబైల్‌లో ఉన్న ఇలాంటి దొంగ యాప్‌లను తొలగించడం కూడా చాలామందికి తెలియదు. అందుకే పోలీసులతోనే వీటిని మొబైల్‌నుంచి ఎలా తొలగించాలో ప్రొజెక్టర్ల ద్వారా చూపించి చేయాలని నిర్ణయించాం. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మొబైల్స్‌లో ప్రమాదకర యాప్‌లను తొలగించే ప్రక్రియ చేపడుతున్నాం.

– ఆర్ఎస్. అమ్మిరెడ్డి, డీఐజీ, అనంతపురం రేంజ్

ప్రశాంతంగా 'గురుకుల' ప్రవేశ పరీక్షలు

- ఐదో తరగతి ప్రవేశానికి 9,099 మంది విద్యార్థుల హాజరు
- ఇంటర్ ప్రవేశ పరీక్ష రాసిన 3,583 మంది విద్యార్థులు



తిమ్మాపురం కేంద్రాన్ని పరిశీలిస్తున్న గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ బాలాజీనాయక్

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల (అంబేడ్కర్ గురుకులాలు)లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఆదివారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్వహించిన రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగిన 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 10,041 మంది విద్యార్థులకు గాను 9,099 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరిగిన ఇంటర్ ప్రవేశ పరీక్షకు 4,228 మంది విద్యార్థులకు గాను 3,583 మంది హాజరయ్యారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మెడికల్ సిబ్బందిని ప్రాథమిక వైద్య కిట్లతో అందుబాటులో ఉంచారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను ప్రతి సెంటర్‌లో సిట్టింగ్ స్క్వాడ్‌గా ఏర్పాటు చేశారు. గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలాజీనాయక్ కురుగుంట, తిమ్మాపురం కేంద్రాలను పరిశీలించారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

న్యూస్‌రీల్

మొక్కజొన్న కొనుగోలుకు నేటి నుంచి రిజిస్ట్రేషన్లు



అనంతపురం అగ్రికల్చర్: రబీలో మొక్కజొన్న పండించిన రైతులు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో అమ్ముకోవాలనుకుంటే సోమవారం నుంచి ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి ఆదివారం తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు ఉన్న మొక్కజొన్న క్వింటా రూ.1,962 ప్రకారం కొనుగోలు చేసి మూడు వారాల్లోపు రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తామని పేర్కొన్నారు. ఆర్‌బీకేల్లో సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సీనియార్టీ వారీగా కొనుగోలు చేస్తామని వెల్లడించారు. ఇక క్వింటా మద్దతు ధర రూ.5,335 ప్రకారం ఈ నెలాఖరు వరకు పప్పుశనగ కొనుగోలు చేస్తామని తెలిపారు. పప్పుశనగ, మొక్కజొన్న రైతులు ఎంఎస్‌పీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డెడ్ స్టోరేజ్‌లో టీబీ డ్యాం



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం) డెడ్ స్టోరేజ్‌కు చేరింది. ఆదివారం నాటికి 100.855 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను 2.950 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో ఏమీ లేకపోగా 256 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 7.550 టీఎంసీలు నిల్వ ఉండేవి. ప్రస్తుతం ఎండ తీవ్రత వల్ల డ్యాంలో నీటి నిల్వ అడుగంటుతూ భారీగా నీరు ఆవిరవుతోంది. డ్యాంలోని నీరు డెడ్ స్టోరేజ్‌కు పడిపోతుండడంతో బోర్డు అధికారులు తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా



అనంతపురం: ఈ నెల 26న జరగాల్సిన ఉమ్మడి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఆ రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ఉన్నందున సమావేశం వాయిదా వేసినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ భాస్కర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి సమావేశం ఎప్పుడనేది త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

రేపటితో ముగియనున్న ప్రీపీహెచ్‌డీ దరఖాస్తు గడువు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) ప్రీపీహెచ్‌డీ రాత పరీక్ష దరఖాస్తు గడువు రూ.1000 అపరాధ రుసుముతో మంగళవారంతో ముగియనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజు రూ.2000గా నిర్దేశించినట్లు పేర్కొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు 27న కౌన్సెలింగ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్, టెస్టింగ్ సెంటర్ల (ఐసీటీసీ)లో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి సంబంధించి 4వ ఎంపిక జాబితా విడుదలైంది. ఈ మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వారి జాబితాను https:// ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. జాబితాలో పేర్కొన్న అభ్యర్థులు ఈ నెల 27న అనంతపురం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావాలి. కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన వారి పేర్లను జాబితాను తొలగిస్తారు.

బసవేశ్వరుని జీవితం ఆదర్శప్రాయం





బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమి, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



వీర శైవ సమాజం ఆధ్వర్యంలో శోభాయాత్ర

అనంతపురం కల్చరల్: సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త బసవేశ్వరుడి జీవితం ఆదర్శప్రాయమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా వీరశైవ సమాజం ఆధ్వర్యంలో నగరంలోని కృష్ణ కళామందిరంలో జగజ్జ్యోతి బసవ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డితో పాటు ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ గౌతమి, వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షులు ఎంజీ రాజు, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖులలో బసవేశ్వరుడు ఒకరని, కుల, వర్ణ, లింగ భేదాలు లేవని, అందరం సమానమేనని శతాబ్దాల కిందటే చాటి చెప్పారని అన్నారు. సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది అని అన్నారు. బసవేశ్వర జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. బసవేశ్వరుడు విలక్షణమైన వ్యక్తిత్వంతో, ఆదర్శప్రాయమైన బోధనలతో గొప్ప సంఘ సంస్కర్తగా నిలిచారని కొనియాడారు. వీరశైవ సమాజం ద్వారా పేద విద్యార్థుల సంక్షేమం కోసం నగరంలో హెచ్చెల్సీ కాలనీలోని హాస్టల్‌కు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు తలారి రంగయ్య తెలిపారు. వీరశైవ సమాజం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. హెచ్చెల్సీ కాలనీ వద్ద వీరశైవ సమాజం కోసం గతంలో ఇచ్చిన 15 సెంట్లను లీజుగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన ఇవ్వడానికి జిల్లా యంత్రాంగం సహకరిస్తుందన్నారు.



కళాకారుడి విన్యాసం

ఆకట్టుకున్న కళా విన్యాసాలు..

బసవజయంతి సందర్భంగా ఆదివారం ఉదయం పాతూరు బసవన్నకట్ట నుంచి కృష్ణకళా మందిరం వరకు శోభాయాత్ర (ర్యాలీ) నిర్వహించారు. తొలుత ప్రధాన అర్చకుడు శాంతమూర్తి నిలువెత్తు నందీశ్వరుడికి పుష్పాలంకరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కర్ణాటక నుంచి విచ్చేసిన కళాకారులు ర్యాలీలో విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా వీరభద్రుడు, మహాశివుడి వేషధారుల ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం కృష్ణకళామందిరం వద్ద ఏర్పాటైన బసవేశ్వరుడి విగ్రహానికి విప్ కాపు, ఎమ్మెల్యే అనంత పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బసవన్నకట్ట మాజీ ఆలయ చైర్మన్ సాంబశివుడు, మల్లికార్జున, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

26న ముఖ్యమంత్రి పర్యటన

- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశం



అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26న జిల్లా పర్యటనకు విస్తున్నారని కలెక్టర్ గౌతమి తెలిపారు. శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో నిర్వహించనున్న 'జగనన్న వసతి దీవెన' నగదు జమ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారన్నారు. సీఎం పర్యటనపై కలెక్టర్ ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు, లబ్ధిదారులను సమావేశానికి బస్సుల్లో తీసుకురావాలని సూచించారు. వాహనాలు నిలిపేందుకు ప్రజలకు, వీఐపీలకు వేరువేరుగా పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సభాస్థలి గ్యాలరీ వద్ద తాగునీరు, మజ్జిగ, స్నాక్స్ అందుబాటులో ఉంచాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 104, 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

వినతులు స్వీకరించాలి: ముఖ్యమంత్రికి సమస్యలు తెలుపుకొనేందుకు వచ్చే ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్రకు సూచించారు. ప్రజల నుంచి ముందస్తుగానే అర్జీలు స్వీకరించి డీఆర్‌ఓకు అందజేయాలని ఆదేశించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఆలూరు సాంబశివారెడ్డి

ఏర్పాట్ల పరిశీలన

శింగనమల/నార్పల: సీఎం పర్యటనకు సంబంధించి నార్పలలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లను ఆదివారం సీఎం కార్యక్రమాల కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాస్‌రావు, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఆర్డీఓ మధుసూదన్ పరిశీలించారు. వీరి వెంట ఆర్‌అండ్‌బీ అధికారి ఓబుల్‌రెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, సొసైటీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి ఉన్నారు.

నేడు సత్యసాయి ఆరాధనోత్సవాలు

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఆరాధనోత్సవాలు సోమవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో ఘనంగా జరగనున్నాయి. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. సత్యసాయి విద్యార్థులు పంచరత్న కీర్తనల అనంతరం ట్రస్ట్ సభ్యుడు నాగానంద సత్యసాయి ట్రస్ట్ సేవలు, ఆరాధనోత్సవాలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం సత్యసాయి సన్నిధిలో కలైమణి గాయత్రి గిరీష్ బృందం సంగీత కచేరి నిర్వహిస్తుంది. వేడుకలను పురస్కరించుకుని ప్రశాంతి నిలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. దేశ విదేశాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పుట్టపర్తి చేరుకున్నారు.

హిల్ వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ..

వేడుకల్లో భాగంగా పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మహానారాయణ సేవ నిర్వహించనుంది. 30 వేల మందికి అన్న, వస్త్ర ప్రసాదాలు పంపిణీ చేస్తారు. ఉత్సవాలు సజావుగా సాగేలా పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



అలంకరణలో సత్యసాయి మహాసమాధి

భూ సర్వేతో చకచకా హద్దులు



రోవర్ ద్వారా హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం (ఫైల్)

- తొలిదశలో 41 గ్రామాల్లో సర్వే పూర్తి

అనంతపురం అర్బన్: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'వైఎస్సార్– జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష' పథకం ద్వారా భూముల సమగ్ర సర్వే కార్యక్రమం చేపట్టింది. సర్వే పూర్తయిన తర్వాత హద్దు రాళ్లు ఏర్పాటు చేసి, యజమానులకు భూహక్కు పత్రం అందజేస్తారు. జిల్లాలో 31 మండలాల్లోని 503 గ్రామాల్లో 10,188.59 చదరపు కిలో మీటర్లు సర్వే చేయనున్నారు. తొలి దశ 13 మండలాల పరిధిలో 41 గ్రామాల్లో ఈ సర్వే చేపట్టి పూర్తి చేయడంతో పాటు హద్దురాళ్ల ఏర్పాటు కార్యక్రమం చేపట్టారు.

సర్వే ప్రక్రియ వేగవంతం : జిల్లాలో భూముల సమగ్ర సర్వే వేగవంతంగా సాగుతోంది. ఇప్పటి వరకు డ్రోన్ ఫ్లై 293 గ్రామాల్లో పూర్తయ్యింది. డ్రోన్ ఫ్లై ద్వారా 61 గ్రామాలకు సంబంధించి ఓఆర్‌ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) ప్రక్రియ పూర్తయ్యింది. ఇందులో 52 గ్రామాలకు సంబంధించి 13 నోటిఫికేషన్ జారీ చేశారు. అదే విధంగా గ్రౌండ్ ట్రూతింగ్ దశ, గ్రౌండ్ వ్యాలిడేషన్ దశ పూర్తి చేశారు.

హద్దురాళ్ల ఏర్పాటు : జిల్లాలో తొలిదశ కింద సమగ్ర సర్వే చేపట్టిన 41 గ్రామాల్లో అన్ని ప్రక్రియలను పూర్తి చేశారు. ఈ గ్రామాలకు సంబంధించి 31,923 ఎల్‌పీఎంలు (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సిద్ధం చేశారు. మొదటి విడతగా జిల్లాకు 59,183 హద్దు రాళ్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఇప్పటి వరకు 27,552 రాళ్లు జిల్లాకు చేరాయి. ప్రస్తుతం 14 గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు పూర్తి చేశారు. ఇందుకుగానూ 20,718 హద్దురాళ్లు వాడారు.

పైలెట్ ప్రాజెక్టుగా 'అనంత' : సర్వే పూర్తయిన 41 గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలను సబ్‌డివిజన్ చేసుకునేందుకు, అదే విధంగా భూముల క్రయవిక్రయాలు జరుపుకునేందుకు ప్రభుత్వం అనంతపురం జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. జాయింట్ ఎల్‌పీఎంలు సబ్‌డివిజన్ చేసుకోవాలనుకునే వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. సబ్ డివిజన్ లేదా భూముల క్రయవిక్రయాల్లో రిజిస్ట్రేషన్, తహసీల్దారు కార్యాలయం పూర్తి చేస్తారు. వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేస్తారు. దాని ఆధారంగా భూహక్కు పత్రం అందజేస్తారు.

హద్దురాళ్లు ఏర్పాటు చేయిస్తున్నాం

'వైఎస్సార్–జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం కింద 41 గ్రామాల్లో సమగ్ర సర్వే పూర్తయ్యింది. 31,923 ఎల్‌పీఎంలు సిద్ధం అయ్యాయి. వీటికి సంబంధించి హద్దురాళ్ల ఏర్పాటు చేశాం. ప్రస్తుతం 14 గ్రామాల్లో ప్రక్రియ పూర్తయ్యింది. రోజుకు 1,500 రాళ్ల ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. సర్వేపూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలు సబ్ డివిజన్ చేసుకునేందుకు పైలట్ ప్రాజెక్టు కింద జిల్లా ఎంపికైంది.

– కిషోర్‌బాబు, ఏడీ, సర్వే భూ రికార్డుల శాఖ

నేడు పంచాయతీరాజ్ దినోత్సవం

అనంతపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సోమవారం గ్రామపంచాయతీ, మండల, జిల్లా స్థాయిలో పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ కే. భాస్కర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ స్థాయిలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ, పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తూ, గ్రామ సభల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి తగు సూచనలు తీసుకొంటామని పేర్కొన్నారు. మండల స్థాయి కార్యక్రమంలో బ్లాక్ స్థాయిలో ఎంపికైన మూడు పంచాయతీలు ఎంపీ, ఎమ్మెల్యే, సీనియర్ ప్రజాకార్యకర్తలు, ముందు వరుస కార్మికులను సత్కరిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో పంచాయతీ అవార్డుకు ఎంపికైన గ్రామ పంచాయతీ ప్రతినిధులకు జిల్లా పరిషత్ హాలులో ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ సమక్షంలో సత్కరిస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

చిలకూరి దేవపుత్ర అవార్డుల ప్రదానం నేడు


అవార్డు అందుకోబోతున్న అప్పలనాయుడు

అనంతపురం కల్చరల్: కథ, నవలా రచయితగా ప్రసిద్ధుడైన దివంగత చిలుకూరి దేవపుత్ర స్మారకార్థం చిలుకూరి దేవపుత్ర సాహిత్య కుటుంబం ఆధ్వర్యంలో అందిస్తున్న 'చిలుకూరి దేవపుత్ర సాహిత్య పురస్కారం' ఈసారి ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా నివాసి అట్టాడ అప్పలనాయుడుకు అందజేయనున్నారు. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు లక్ష్మీ దేవపుత్ర, దీవెన కోరారు.

ఇద్దరికి గాయాలు

బ్రహ్మసముద్రం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఎర్రప్ప దొడ్డి గ్రామానికి చెందిన లింగప్ప, చెలిమేపల్లికి చెందిన గోపి ద్విచక్రవాహనంపై అతివేగంగా వెళ్తూ భైరసముద్రం సమీపంలోని మలుపువద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి పడ్డారు. ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. అటుగా వస్తున్న వాహనదారుల సాయంతో గాయపడిన ఇద్దరినీ 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టౌన్ ప్లానింగ్ విభాగంలో ముగ్గురికి మెమోలు

అనంతపురం క్రైం: నగర పాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సీ మురళీకృష్ణ, పట్టణ ప్రణాళిక కార్యదర్శి త్రివేణి, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ భగవాన్ అగ్నివేశ్‌కు సంస్థ కమిషనర్ రమణారెడ్డి మెమో జారీ చేశారు. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఆదిమూర్తినగర్‌లోని ఓ షోరూం సమీపంలో ఓ నిర్మాణాన్ని కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్స్ వదలకపోడం, రోడ్డును ఆక్రమించడంపై ప్రారంభదశలో ఎందుకు చర్యలు తీసుకోలేదని పట్టణ ప్రణాళిక కార్యదర్శి త్రివేణి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆయన ప్రశ్నించారు. వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో మెమోలు జారీ చేశారు.

అక్రమాలకు 'జై' ఎన్‌టీయూ

- ఇష్టానుసారంగా పీహెచ్‌డీ సీట్ల కేటాయింపు
- ఎక్స్‌టర్నల్ పేరుతో అక్రమంగా పార్ట్‌టైం పీహెచ్‌డీలు
- ఫుల్‌టైం పీహెచ్‌డీల పరిశోధనలకు ఆటంకం కలిగిస్తూ లెక్చరర్‌గా పనిచేయించుకుంటున్న వైనం
- ఒక్కో ప్రొఫెసర్‌కు 8 మంది కంటే ఎక్కువ విద్యార్థుల కేటాయింపు


జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో పరిశోధన నాస్తి.. విద్యార్థులు జాస్తి అనే పరిస్థితి నెలకొంది. వర్సిటీ అధికారులు అక్రమాలకు జై కొడుతూ పరిశోధన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

థీసిస్ పరిశీలనలో అంతులేని జాప్యం..

జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాలో 90 ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. ప్రతి 20 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు 1 ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు అనివార్యం. అసోసియేట్ ప్రొఫెసర్ హోదాలో కొనసాగాలంటే పీహెచ్‌డీ తప్పనిసరిగా పూర్తి చేయాలి. అయితే పీహెచ్‌డీ చేసిన అభ్యర్థుల కొరత ఎక్కువగా ఉండడంతో జేఎన్‌టీయూ (ఏ) పరిశోధన నిబంధనల్లో వెసులుబాటు కల్పించారు. దీంతో ఇబ్బడిముబ్బడిగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించారు. నిబంధనల మేరకు ఒక్కో ప్రొఫెసర్ వద్ద గరిష్ఠంగా 8 మంది పీహెచ్‌డీ విద్యార్థులను కేటాయించాల్సి ఉండగా.. అడ్మిషన్ల సంఖ్య పెరగడంతో ఈ సంఖ్య గణనీయంగా పెంచేశారు. దీంతో పీహెచ్‌డీ థీసిస్‌ను పరిశీలించే సమయం లేక ఏళ్ల తరబడి ప్రొఫెసర్ల చుట్టూ పరిశోధన విద్యార్థులు తిరుగుతున్నారు.

పార్ట్‌టైం పీహెచ్‌డీ ముద్దు..

జేఎన్‌టీయూ(ఏ)లో ఫుల్‌టైం పరిశోధనలు నామమాత్రంగా నిర్వహిస్తూ ఎక్స్‌టర్నల్ పీహెచ్‌డీ పేరుతో పార్ట్‌టైం పీహెచ్‌డీ అడ్మిషన్లు ఇబ్బడిముబ్బడిగా కల్పించారు. పార్ట్‌టైం పీహెచ్‌డీకి ఇద్దరు గైడ్‌లు ఉండేలా సొంత నిబంధనలు అమలు చేశారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రొఫెసర్‌గా, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న వారికి గైడ్‌గా పనిచేసే అవకాశం కల్పించారు. వీరు వర్సిటీ క్యాంపస్ కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్‌కు కో–గైడ్‌గా వ్యవహరించాల్సి ఉంది. ఈ ఇద్దరి సమన్వయంతో విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేయాలి. మెయిన్ గైడ్, కో– గైడ్ ఇద్దరికీ కలిపి 8 మంది పరిశోధన విద్యార్థులకు మించకూడదు. వర్సిటీ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్లకు ఫుల్‌టైం పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థితో పాటు పార్ట్‌టైం పీహెచ్‌డీ కింద లెక్కకు మించి స్కాలర్లను కేటాయించారు. ఈ క్రమంలో పీహెచ్‌డీ థీసిస్ పరిశీలించే సమయం లేక అవార్డు కావడానికి అసాధారణ జాప్యం చోటు చేసుకుంటోంది.

ప్రైవేట్ అధ్యాపకులూ గైడ్‌గా..

యూజీసీ నిబంధనల మేరకు క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న వారికే పీహెచ్‌డీ గైడ్‌గా అవకాశం కల్పించాలి. కానీ జేఎన్‌టీయూ(ఏ) పరిధిలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులకు సైతం పీహెచ్‌డీ గైడ్‌గా అవకాశం కల్పించారు. ప్రైవేట్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఒక్కో పీహెచ్‌డీ సీటు కేటాయించారు.

రీసెర్చ్ సెంటర్లలోనూ పరిశోధన లేమి..

జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో 16 రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇవన్నీ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలు, అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉన్నాయి. ఇందులో కేవలం ఫుల్‌టైం పీహెచ్‌డీకి అవకాశం కల్పించారు. ఫుల్‌టైం వారికి ప్రతి నెలా రూ.15 వేలు చొప్పున ఫెలోషిప్ ఇవ్వాలి. ఇక్కడ వరకూ అంతా బాగున్నా.. ఫెలోషిప్ అందుకుంటున్న విద్యార్థుల సమయాన్ని పరిశోధనలకు కేటాయించకుండా వారితో తరగతుల నిర్వహణకు తెరలేపారు. దీంతో పీహెచ్‌డీ విద్యార్థుల ఏకాగ్రత లోపించి పరిశోధనల్లో నాణ్యత లోపిస్తోందనే వాదనలున్నాయి. ఇప్పటికైనా యూజీసీ నిబంధనలు అమలు చేసి నాణ్యమైన పరిశోధనలు కొనసాగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఒకే గైడ్ కింద పరిశోధనలు కొనసాగేలా చర్యలు

యూజీసీ నిబంధనల ప్రకారం గైడ్, కో–గైడ్‌కు కలిపి గరిష్ఠంగా 8 మంది పరిశోధన విద్యార్థులు మించి ఉండకూడదు. ఈ నేపథ్యంలో కో–గైడ్ లేకుండా ఒకే మెయిన్ గైడ్ కింద పరిశోధనలు చేసేలా చర్యలు తీసుకున్నాం. రీసెర్చ్ సెంటర్లలో పరిశోధనకు ఆటంకం కలిగించేలా స్కాలర్లతో అధ్యాపకుడిగా పనిచేయించుకుంటున్న వారిపై చర్యలు తీసుకుంటాం. దీనిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపడతాం.

– ప్రొఫెసర్ శోభాబిందు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, జేఎన్‌టీయూ (ఏ)

మళ్లీ అధికారం వైఎస్సార్‌సీపీదే

- టైమ్స్ నౌ సర్వే నిజాన్నే చెప్పింది.
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య


మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసి రెండో సారి జగన్ సర్కార్‌ను ఏర్పాటు చేయడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024లో జరిగే ఎన్నికలు, ఫలితాలపై టైమ్స్ నౌ చేపట్టిన ప్రీ పోల్స్ సర్వే విశ్లేషణ మూడు రోజులు క్రితం విడుదలైందని గుర్తు చేశారు. ఇందులో 25 ఎంపీ స్థానాలను వైఎస్సార్‌సీపీ దక్కించుకుంటుందని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ లెక్కన అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాలూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. తెలుగు దొంగల పార్టీ (టీడీపీ) అధినేత నారా చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు నీరు చెట్టు, జన్మభూమి కమిటీలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, అమరావతి రాజధాని నిర్మాణం వంటి వాటిల్లో అంతులేని అవినీతికి పాల్పడ్డాడన్నారు. ఈ అక్రమాలు బహిర్గతం కావడంతో ప్రజలు ఏవగించుకుంటున్నారన్నారు. తాము అధికారంలోకి తీసుకువస్తే రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారో చెప్పే పరిస్థితిలో లేని తండ్రీకొడుకులు... రాష్ట్రంలో అలజడులు సృష్టించి లబ్ధి పొందాలనుకుంటున్నారని లోకేష్, చంద్రబాబుపై మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. 'మా భవిష్యత్తు నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, వలంటీర్లు గడపగడపకూ వెళుతుంటే ప్రజలు ఆదరిస్తున్న తీరు ఇందుకు నిదర్శనమన్నారు.

బీసీ కార్పొరేషన్ ఈడీగా కుష్బూ కొఠారి

అనంతపురం రూరల్: బీసీ కార్పొరేషన్ ఈడీగా కుష్బూ కొఠారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ గౌతమి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ కార్పొరేషన్ ఈడీగా పని చేస్తున్న నాగముని ఉద్యోగ విరమణ వయోపరిమితి పూర్తి కావడంతో ఆయన స్థానంలో బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కుష్బూకొఠారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

నేటి నుంచి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు


గవి రంగనాథస్వామి మూలవిరాట్

హిందూపురం: మండలంలోని చలివెందుల గ్రామంలో కొండపై వెలిసిన శ్రీలక్ష్మి గవిరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగానే స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం కొత్తగా నిర్మించిన మెట్లకు ఆదివారం గ్రామస్తులు పూజలు చేశారు. సోమవారం ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం దీపోత్సవం, స్వామివార్ల కల్యాణం ఉంటుందని అర్చకులు సురేష్, ఫణికుమార్ తెలిపారు. 25న మధ్యాహ్నం రథోత్సవం, 26న ముత్యాల పల్లకీ ఉత్సవం, పార్వేటోత్సవం, 27న శేష వాహనం, శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

దానిమ్మ తోటకు నిప్పు

బెళుగుప్ప: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి దానిమ్మ తోట దగ్ధమైంది. స్థానికులు తెలిపిన మేరకు... బెళుగుప్పకు చెందిన రైతులు ఓబిరెడ్డి, రామగోపాలరెడ్డి సాగు చేస్తున్న దానిమ్మ తోటలకు సమీపంలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు వ్యాపించి దాదాపు 800 దానిమ్మ చెట్లతో పాటు అంతరసాగుగా చేపట్టిన టమాట పంట పూర్తిగా బూడిదయ్యాయి. 60 కట్టల డ్రిప్ పైపులు, గేట్‌వాల్వ్ పైపులు కాలిపోయాయి. దీంతో రూ.4.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న కళ్యాణదుర్గం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మరో మూడు ఎకరాల్లోని మొక్కజొన్న పంటకు మంటలు వ్యాపించకుండా మంటలను ఆర్పివేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి: వేర్వేరు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 16 మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను తాడిపత్రి రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ వెల్లడించారు. మండలంలోని సజ్జలదిన్నె గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.27,770 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మరో కేసులో కొండయ్య, జయరామిరెడ్డితో పాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.15,690 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

29 నుంచి జిల్లా స్థాయి షటిల్ టోర్నీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 29వ తేదీ నుంచి రెండ్రోజుల పాటు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఎస్‌ఏ కోచ్ నరేష్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అండర్–11 సింగిల్స్, అండర్–13 సింగిల్స్/డబుల్స్, అండర్–15 సింగిల్స్/డబుల్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 28వ తేదీ లోపు అనంతపురంలోని అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 99661 03956లో సంప్రదించవచ్చు.

స్టాఫ్‌నర్స్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఏఆర్‌టీ స్టాఫ్ నర్సు పోస్టును కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయనున్నారు. ఈ మేరకు జిల్లా ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ ఆదివారం తెలిపారు. ఈ పోస్టుకు అంధ అభ్యర్థులు(వీహెచ్) మాత్రమే అర్హులు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 25 నుంచి 27వ తేదీలోపు దరఖాస్తులను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కార్యాలయంలో అందజేయాలి. పూర్తి వివరాలకు https://ananthapuramu.ap. gov. in వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

చెరువులో పడి బాలిక మృతి


రెహాన మృతదేహం

బుక్కరాయసముద్రం: మండలంలోని సెంట్రల్ జైలు సమీపంలో ఉన్న నారాయణప్ప కుంట చెరువులో ప్రమాదవశాత్తు ఓ బాలిక పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రంజాన్ పండుగ మరుసటి రోజు ముస్లింలు ఉల్లాసంగా జరుపుకునే 'బాసీ ఈద్'ను పురస్కరించుకుని అనంతపురంలోని అంబార్‌వీధికి చెందిన నసీమా ఆదివారం ఉదయం తన కుమార్తెలు షహీనా, రెహాన (9)తో పాటు మరో వ్యక్తితో కలసి నారాయణప్ప కుంట వద్దకు చేరుకుంది. ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహార పదార్థాలు భోజనం చేసిన తర్వాత చెరువులోకి దిగి సరదాగా కేరింతలు కొట్టసాగారు. ఆ సమయంలో లోతైన ప్రాంతానికి చేరుకున్న షహీన, రెహాన నీట మునిగిపోయారు. నసీమా కేకలతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే నీటిలో దూకి పిల్లలను వెలికి తీసేలోపు రెహాన మృతి చెందింది. షహీన ప్రాణాలతో బయటపడింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


వెంకటస్వామి (ఫైల్)

రాప్తాడురూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్న రాప్తాడు మండలం బుక్కచెర్ల గ్రామానికి చెందిన ఈడిగ వెంకటస్వామి (65) ఆదివారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు... ఈ నెల 21న వెంకటస్వామి అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ సమీపంలో చర్చి వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన వెంకటస్వామిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అదేరోజు బెంగళూరుకు తీసుకెళ్లారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ సైతం నిర్వహించారు. చికిత్సకు స్పందించక ఆయన ఆదివారం మృతిచెందాడు.

వ్యక్తి ఆత్మహత్య

గుమ్మఘట్ట: మండలంలోని ఆర్.కొత్తపల్లిలో కేడిమి తిమ్మారెడ్డి(66) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. తోటలో నివాసం ఉంటున్న తిమ్మారెడ్డి , తిప్పమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నాయి. నలుగురికి వివాహాలయ్యాయి. వ్యవసాయం చేసుకుని జీవనం చేసేవారు. తిమ్మారెడ్డి రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆదివారం కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి మూలవిరాట్, రథాన్ని లాగుతున్న భక్తులు

బొమ్మనహాళ్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం బొమ్మనహాళ్‌లో వేంకటేశ్వర స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. ఉదయం 10 గంటలకు రథాంగహోమం, బలి సమర్పణ, మడుగు రథోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు దేవేరులతో కలసి శ్రీవారి ఉత్సవమూర్తిని పల్లకీలో అధిష్టింపజేసి ప్రాకారోత్సవాన్ని జరిపించారు. అనంతరం రథంపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి గోవింద నామస్మరణతో భక్తులు లాగారు. వివిధ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

• సందడే సందడి


నీటి కొలనులో చిన్నారుల సందడి

రంజాన్ తర్వాత వచ్చే బాసీ ఈద్‌ను పురస్కరించుకుని ఆదివారం అనంతపురంలోని నేషనల్ పార్కు కిటకిటలాడింది. ముస్లింలు కుటుంబ సభ్యులతో కలసి పెద్దసంఖ్యలో పార్కుకు చేరుకుని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా స్థానిక శిల్పారామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులు నృత్యాలతో అలరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం




ఊయల ఊగుతున్న మహిళ.. ఒంటెపై చిన్నారుల విహారం


సాంస్కృతిక కార్యక్రమాలను చూసేందుకు వచ్చిన జనం

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి భీజాక్షర హోమం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామి వారికి భీజాక్షర హోమం నిర్వహించారు. అనంతరం స్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ఆకుపూజ, పల్లకీసేవ, కుజదోష, కాలసర్పదోష నివారణకు సుబ్రహ్మణ్యేశ్వరభీజాక్షర హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి పూజలు నిర్వహించి, మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన,ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నేడు 'స్పందన'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సావిత్రి స్పందన నిర్వహిస్తారని, ప్రజలు తమ సమస్యలను తెలియజేయొచ్చన్నారు.

వేరే కులాలను ఎస్టీల్లో చేర్చడం అన్యాయం

అనంతపురం టవర్‌క్లాక్: వేరే కులాల వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం అన్యాయమని ఆలిండియా బంజారా సేవాసంఘం గౌరవాధ్యక్షుడు అశ్వర్థనాయక్ అన్నారు. ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ నుంచి నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వర్థనాయక్ మాట్లాడుతూ జీవో 52 వెంటనే రద్దు చేయాలని, గిరిజనులు వీటిని వ్యతిరేకించాలని అన్నారు. ఇతర కులాలు ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల గిరిజనులు నష్టపోతారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజనులు ఐక్యతతో పోరాటాలు చేయాలన్నారు. అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌నాయక్, ప్రసాద్‌నాయక్, కిరణ్ కుమార్‌నాయక్, కుమార్‌నాయక్, సింగ్‌నాయక్, సుగుణ బాయి, చంద్రీబాయి, ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పోతలయ్యస్వామి ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలందుకున్న పోతలయ్య స్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు గ్రామాలకు స్వామి కాపులు, భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు స్వామిని దర్శించుకున్నారు. భక్తులు పోతలయ్యస్వామికి బోనాలు సమర్పించారు. మామిళ్లపల్లి గ్రామంలో మంగళవారం పోతలయ్యస్వామికి గావుల మహోత్సవాన్ని నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు.

చేపల సొసైటీ కార్యాలయం ప్రారంభం

రామగిరి: మండలంలోని పేరూరులో ఆదివారం చేపల సొసైటీ కార్యాలయాన్ని ఎంపీపీ కవ్రెన్న, సర్పంచ్ రాజేష్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో పేరూరుడ్యాంలో నీరులేనందున తాగునీరు, సాగునీటికి ప్రజలు, రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో పేరూరుడ్యాంతో పాటు నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీనీవానీటితో నింపినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ ముజుబుర్ రహిమాన్, చేపల సొసైటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుల వనం..
కొలువే లక్ష్యం!

ఉన్నత ఆశయంతో నేర్చిన పాఠం ఉన్నత శిఖరాలను చేరిస్తే.. క్రమశిక్షణతో చేసిన 'సాధన' కొలువు దరిచేరుస్తుంది. చదువు పూర్తయిన తర్వాత సన్నద్ధమే ఇక సరి.. నిరుద్యోగ యువత ఎన్నో ఆశలతో కొలువుపై గురిపెట్టింది. విద్య విజ్ఞానం అందిస్తే.. కఠోరశ్రమ భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. చదువుకు తరగతి గదే అవసరం లేదు.. కాసింత చెట్టు ఉన్నా చక్కగా చదువుకోవచ్చని విద్యార్థులు, నిరుద్యోగులు నిరూపిస్తున్నారు. దీంతో నగరంలోని రెండో రోడ్డులో ఉన్న పార్కు.. 'చదువుల వనం'లా మారింది. కొలువే లక్ష్యంగా యువత నిరంతరం శ్రమిస్తోంది. పలు ప్రాంతాల్లో అద్దె గదుల్లో ఉంటున్న యువత.. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఇలా పార్కులోనే చదువుతున్నారు. రోజూ సుమారు 200 మంది దాకా పోటీపరీక్షలకు ప్రిపేరవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించడంతో యువత మరింత రెట్టింపు ఉత్సాహంతో చదువుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



కొలువే గురి: చెట్ల కింద కుర్చీల్లో కూర్చొని చదువుతున్న యువత



చదువేలోకం: ఇష్టపడి చదువుతూ..



దాహం: చల్లని కుండనీరు తాగుతున్న యువతులు



ఆశయం: పోటీ పరీక్షలకు ప్రిపేరవుతూ..

స్టడీ పార్కును పరిశీలించిన కమిషనర్



సైఫుల్లా బ్రిడ్జ్‌పై మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్ శేఖర్‌బాబు

అనంతపురం క్రైం: నగరంలోని రెండో రోడ్డులో ఉన్న స్టడీ పార్కును కమిషనర్ రమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతతో ఆయన మాట్లాడారు. వారి విజ్ఞప్తి మేరకు తాగునీటి సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఈ నరసింహ, ఏఈ సాయిని ఆదేశించారు. పార్కులో రిపేరీలో ఉన్న ప్లాంట్‌ను పరిశీలించి, మరమ్మతు చేయించాలన్నారు. అంతవరకు ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా రోజూ అక్కడ ఏర్పాటు చేసిన కుండల్లో తాగునీటిని ఉంచాలన్నారు. పార్కును శుభ్రంగా ఉంచేలా చూడాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సైఫుల్లా బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన మొక్కలను కమిషనర్ పరిశీలించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మొదటి రోడ్డులో జరుగుతున్న క్లాప్ ఆటోల చెత్త సేకరణను పరిశీలించి.. చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ శేఖర్‌బాబు తదితరులున్నారు.

వైభవంగా శతాబ్ది ఉత్సవాలు



అలంకరణలో మహాశివుడు



వేడుకలను ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నాలుగురోజుల పాటు వైభవంగా సాగనున్న ఉత్సవాలను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రుత్వికులు హోమ క్రతువులు, వేదమంత్రాలతో ఆధ్యాత్మిక భావాన్ని ఉట్టిపడేలా ప్రారంభించారు. ఆలయ అనువంశీకులు హోసూరు సుబ్రహ్మణ్యం నేతృత్వంలో సాగిన తొలిరోజు కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంత చంద్రారెడ్డి పాల్గొన్నారు. సుందరంగా ముస్తాబు చేసిన ఆలయ ప్రాంగణంలో సుంకేశుల సత్యనారాయణ, నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో 11 హోమ గుండాలను ఏర్పాటు చేసి, 50 మంది వేదపండితులు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం గణపతి పూజలు, పుణ్యావాచనం, నాంది పూజలతో అంకురార్పణ చేశారు. సాయంత్రం శ్రీ లలితా, విష్ణు సహస్రనామపారాయణం వీనుల విందుగా సాగింది. అనంతరం సంస్కృత పండితులు డాక్టర్ నాగత్రిశూల పాణి ఆధ్యాత్మిక ప్రవచనంలో మహాశివుడి లీలామహత్యంను వివరించారు. ఈవో రమేష్‌బాబు మాట్లాడుతూ జిల్లాకే గర్వకారణంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, సోమవారం అహోబిళ పీఠాధిపతులు శ్రీరంగనాథ యతీంద్ర మహాదేశికన్ విశిష్ట అతిథిగా హాజరై అనుగ్రహభాషణం చేస్తారన్నారు. భక్తులు నాలుగు రోజుల కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ధర్మకర్తల మండలి సభ్యులు సుబ్రమణ్యం, చంద్ర, తిమ్మారెడ్డి, నళిని, రాజేశ్వరి, కల్పన కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ లక్ష్మీరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మట్టి దోపిడీ

ఆత్మకూరు: అధికారంలో ఉన్నా.. లేకున్నా దోపిడీ చేయడమే లక్ష్యంగా ఎంచుకున్నారు టీడీపీ నాయకులు. అడ్డదారుల్లో ఆదాయ మార్గాలను ఎంచుకుని పర్యావరణాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆత్మకూరు మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు యథేచ్ఛగా మట్టి దోపిడీకి తెరలేపాడు. మండలంలో యువనాయకుడిగా చలామణి అవుతూ ఆ పార్టీ యువనేత వద్ద ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. యువనేత అండ చూసుకొని మట్టి దందా చేస్తున్నాడు. ఆత్మకూరు సమీపంలోని వై.కొత్తపల్లి వద్ద జాతీయ రహదారి నుంచి కనుచూపు మేరలోని తన పొలంలో జేసీబీలు ఉపయోగించి.. టిప్పర్లతో మట్టి తరలిస్తున్నాడు.

నిబంధనలు బేఖాతర్

మట్టి, ఇసుక రవాణాపై ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించినా టీడీపీ నేత లెక్క చేయలేదు. సొంత పొలం నుంచే అయినా మట్టి తరలించాలంటే రెవెన్యూ శాఖతో పాటు భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతులు తప్పనిసరి. ఐదు కిలోమీటర్లలోపు మట్టి తరలింపునకు రెవెన్యూ అధికారుల అనుమతి పొందాలి. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. అయితే టీడీపీ నాయకుడు మాత్రం ఎలాంటి అనుమతి లేకుండానే మట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు ఆపార్టీ నేతలే విమర్శిస్తున్నారు.



జేసీబీలతో టిప్పర్లలోకి మట్టిని లోడు చేస్తున్న దృశ్యం

అనుమతి తప్పనిసరి

సొంత పొలం నుంచైనా మట్టి తరలించాలంటే అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతి ఉంటేనే మట్టి తరలించేందుకు వీలవుతుంది. నిబంధనలు ధిక్కరిస్తే తనిఖీలు చేపట్టి ఎంత మేరకు మట్టి తవ్వారో కొలతలు తీసి జరిమానా విధిస్తాం.

– ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన

అనంతపురం క్రైం: ఇటీవల ప్రకాషం జిల్లా ఎర్రగొండపాలెంలో టీడీపీ చేసిన హైడ్రామాను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు నోటికి నల్లబ్యాడ్జీలు ధరించి ఆదివారం నిరసన తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ మాట్లాడుతూ... మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఎర్రగొండపాలెంలో టీడీపీ కార్యకర్తలతో తనపై రాళ్ల దాడి చేయించుకొని, ఆ దాడిని మంత్రి ఆదిమూలపు సురేష్‌పై నెడుతున్నారన్నారు. ఇది హేయమైన చర్య అని, దళితుల జోలికొస్తే తరిమికొడతామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దళితులకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మిద్దెకుళ్లాయప్ప, సాకే శంకర్, బంగి సుదర్శన్, రామాంజనేయులు, చంద్రయాదవ్, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెల్పుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

చెన్నేకొత్తపల్లి : పార్టీ నాయకులు, కార్యకర్తలకు తోపుదుర్తి కుటుంబం అన్నివిధాలా అండగా ఉంటుందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నామాలలో అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ నాయకుడు వెంకటరామిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి,నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకి వెంకటరామిరెడ్డి విశేష సేవలు అందించారన్నారు. మృతుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించారు. అనంతరం వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చెన్నారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆయన్ను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, సర్పంచ్ కృష్ణమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలు రామచంద్రారెడ్డి, నాయకులు మేడాపురం సూరి, తదితరులు పాల్గొన్నారు.



వెంకటరామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

సంతల ఆదాయం రూ.3.05 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.05 లక్షలకు పైగా ఫీజు వసూలైనట్లు యార్డు ఛైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,72,910, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,32,500 మేర ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.

నేడు ఆధ్యాత్మిక పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్‌నారాయణ ఆదిశంకరుల బోధనలపై రచించిన ఆధ్యాత్మిక పుస్తకాలను సోమవారం సాయంత్రం ఆవిష్కరించనున్నారు. స్థానిక శారదానగర్‌లోని శంకర మఠంలో సాయంత్రం 6.30 గంటలకు జరిగే ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం, సామూహిక శంకర పారాయణం, పుస్తకావిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొనాలని మఠం మేనేజర్ సత్యప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యాశాఖ ఆర్జేడీని కలిసిన వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు



ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

రాప్తాడురూరల్: ప్రాథమిక విద్యాశాఖ కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న మార్తాల వెంకట కృష్ణారెడ్డిని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఆదివారం కలిశారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఓబుళపతి, గౌరవాధ్యక్షుడు హెచ్.గిరిధర్‌రెడ్డి, కోశాధికారి వి.రాజమోహన్‌రెడ్డి, వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు ఈసీ విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చౌదరి, నందకుమార్ తదితరులు కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రీజయన్ పరిధిలోని డీఈఓ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఆర్జేడీని కోరారు. అనంతపురం జిల్లాలో పదో తరగతి పరీక్షల ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వర్తిస్తూ, సస్పెండ్ అయిన టీచర్లకు సంబంధించి విచారణను వేగవంతం చేసి, సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

- సీపీఐ,సీపీఎం నాయకులు పిలుపు



జాతాలో పాల్గొన్న సీపీఐ, సీపీఎం నాయకులు

రాప్తాడురూరల్: కేంద్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ,సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న 'ప్రచార జాతా'లో భాగంగా అనంతపురం రూరల్ మండలం కందుకూరు ఎఫ్‌సీఐ గోదాము నుంచి పంగల్‌రోడ్డు వరకు పాదయాత్రగా వెళ్లారు. ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున మాట్లాడారు. కష్టజీవులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. 47 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి. పి.రామకృష్ణ, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్షయ తృతీయ

అనంతపురం కల్చరల్: దానధర్మాలకు ప్రతీకగా భావించే అక్షయ తృతీయ వేడుకలు ఆదివారం జరిగాయి. స్థానిక శ్రీశివబాలయోగి ఆశ్రమంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గుప్తా, దేవరాజ్ తదితరులు విశేష అలంకార సేవలు చేయించారు. తపోవనంలోని శ్రీశివశక్తి ఆలయంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో 108 సార్లు తారక మంత్ర పారాయణం , అనంతరం సీతారాముల కల్యాణం , మహాలక్ష్మి పూజ నిర్వహించారు. పాతూరులోని ప్రాచీన దత్తాత్రేయస్వామి ఆలయంలో అప్పాసుధీర్ నేతృత్వంలో మూలవిరాట్‌కు చందన అలంకారాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అక్షయ తృతీయను పురస్కరించుకొని బంగారం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



పూజలందుకున్న వేంకటేశ్వరుడు

పేకాట రాయుళ్ల అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని చెరువుకట్ట కింద పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.4,330 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. పట్టుబడిన వారంతా రాజమ్మకాలనీకి చెందిన వారుగా సీఐ తెలిపారు.

ముగ్గురు అదృశ్యం

స్థానిక వన్‌టౌన్ పరిధిలో నివాసం ఉంటున్న సున్నంగేరికి చెందిన హరిత అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- బుక్కరాయసముద్రం బొమ్మలాట పల్లికి చెందిన స్వరూప అనే యువతి కుటుంబం ప్రస్తుతం నగరంలోని నవోదయకాలనీలో నివాసం ఉంటోంది.కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ కనిపించలేదు. బాధితులు ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రామచంద్రనగర్‌లో సాయి శివ అనే యువకుడు శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.